క్లుప్తంగా

నేడు పెన్షనర్ల సమావేశం

పార్వతీపురంటౌన్: స్థానిక రైతు బజార్ వద్ద గల పెన్షనర్ల సమావేశ మందిరంలో రాష్ట్ర ప్రభుత్వం సోమవారం పెన్షనర్లతో సమావేశం నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి డి.గణపతిరావు తెలిపారు. ఈ సమావేశానికి పెన్షనర్లంతా హాజరు కావాలని కోరారు. ఇన్‌కమ్‌టాక్స్ గురించి వివరించడానికి నిపుణులు ఈ సమావేశానికి హాజరవుతారని పేర్కొన్నారు.

వేగవంతంగా ఇంటింటి కుళాయి పనులు

సీతానగరం: మండలంలో ఇంటింటి కుళాయిల పనులు వేగవంతంగా జరుగుతున్నాయని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.పవన్ కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన అంటిపేట పంచాయతీ పరిధిలో ఉన్న వెంకటాపురం, వెన్నెల బుచ్చింపేట, అంటిపేట గ్రామాల్లోని కాలనీల్లో ఆదివారం పర్యటించి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఇంటింటి కుళాయిల పనులు పూర్తి కావచ్చాయన్నారు. త్వరలో ఎమ్మెల్యే అలజంగి జోగారావు చేతుల మీదుగా కుళాయిలను ప్రారంభించడానికి సిద్ధం చేస్తున్నామని తెలియజేశారు.

భక్తిశ్రద్ధలతో ఈస్టర్



పెదపెంకిలో ఈస్టర్ వేడుకలను నిర్వహిస్తున్న క్రైస్తవ సోదరులు

బలిజిపేట: మండలంలో ఈస్టర్ వేడుకలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఏసుక్రీస్తు మృతి చెందిన మూడవ రోజున పునరుత్థాన దినంగా భావిస్తూ క్రైస్తవులు జరుపుకునే రోజును ఈస్టర్‌గా చెప్పుకుంటారు. అందులో భాగంగా పెదపెంకిలో తెలుగు బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవరెండ్ ఆర్.అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ పురవీధుల్లో క్రైస్తవ సోదరులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం చర్చిలో ప్రార్థనలు చేశారు. అలాగే చిలకలపల్లి గ్రామంలో కూడా కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం పెద్దలు, సభ్యులు పాల్గొన్నారు.

మొక్కజొన్నకు గిట్టుబాటు ధర కల్పించాలి



మాట్లాడుతున్న సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్న

సీతానగరం: మండలంలోని రైతులు పండిస్తున్న మొక్క జొన్నపంటకు గిట్టుబాటు ధర కల్పించాలని సీపీఐ జిల్లాసహాయ కార్యదర్శి టి జీవన్న కోరారు. ఈ మేరకు ఆదివారం ఆయన బూర్జ వచ్చిన సందర్భంగా జొన్నపంట సాగు రైతులతో మద్దతు ధరపై చర్చించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎరువులు, పురుగు మందుల ధరలు గణనీయంగా పెరిగినా రైతులు పండించిన వ్యవసాయ ఉత్పత్తులకు కేంద్ర ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించకపోవడం శోచనీయమన్నారు. ప్రస్తుతం రైతుల పొలాల్లో పండించిన మొక్క జొన్న పంటకు గిట్టుబాటు ధర లేక పోవడంతో పంటంతా నూర్పిడి చేసిన కళ్లాల్లోనే గింజలు నిల్వలుంచాల్సి వస్తుందన్నారు. క్వింటా జొన్నగింజలు ఇంతవరకూ రూ.2,400లు కొనుగోలు చేశారన్నారు. పంట విక్రయానికి వచ్చేసమయానికి రూ.1,900లు మించి కొనలేమని వర్తకులు అంటున్నారని ఆరోపించారు. జొన్నపంటకు గిట్టుబాటు ధరకల్పించాలని అన్ని ప్రాంతాల్లో జొన్నపంటకు మద్దతుధర పెంచాలని కోరుతూ ఆందోళన చేయాలని నిర్ణయించామన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం స్పందించి మొక్కజొన్న గింజలు క్వింటాకు రూ.2,500 చెల్లించేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో రైతులు కృష్ణారావు, గోపినాయుడు, ధనంజయ్ పాల్గొన్నారు.

స్నేహితుడికి సాయం



శ్రీనివాసరావుకు నగదు, వస్త్రాలు అందజేస్తున్న మిత్రులు

పాలకొండ రూరల్: చిన్నప్పుడు తమతో కలిసి చదువుకున్న మిత్రుడు ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడని తెలుసుకుని తోటి స్నేహితులు అండగా నిలిచారు. పట్టణానికి చెందిన ఒప్పంగి శ్రీనివాసరావుది రెక్కాడితేగాని డొక్కాడని కుటుంబం. పైగా అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నాడు. ఈ క్రమంలో ఆయన కుమార్తెకు వివాహం కుదిరింది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న స్నేహితుని పరిస్థితి తెలుసుకున్న చిన్ననాటి మిత్రులు దిలీప్‌కుమార్, శిల్లా మల్లేశ్వరరావు, తలే సీతారాము తదితరులు ఆదివారం మిత్రుడు శ్రీనివాసరావుని కలిసి ధైర్యం చెప్పారు. ఆయన కుమార్తె వివాహం కోసం రూ.20 వేల నగదు, పట్టువస్త్రాలు అందించారు. మిగిలిన స్నేహితులతో కలిసి మరింత సహకారం అందిస్తామన్నారు.

సంక్షేమ సారథి జగన్‌ను ఆశీర్వదించండి

- 'జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం'లో ఎమ్మెల్యే జోగారావు
- ప్రజాభిప్రాయ సేకరణలో పాల్గొన్న గృహసారథులు, వలంటీర్లు



పార్వతీపురం టౌన్: మహిళ నుంచి అభిప్రాయం సేకరిస్తున్న ఎమ్మెల్యే జోగారావు



పార్వతీపురం టౌన్: బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

పార్వతీపురంటౌన్: సంక్షేమ సారథి సీఎం జగన్‌మోహన్ రెడ్డిని ఆశీర్వదించండని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం నియోజకవర్గ కేంద్రం, పురపాలక సంఘం 21వ వార్డులో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మా నమ్మకం నువ్వే జగన్' అన్నది ప్రజల నినాదంగా మారుమోగుతోందన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల మంది జగనన్న సైనికులు 14 రోజుల్లో (ఏప్రిల్ 7 నుంచి 20 వరకు) 75 వేల కుటుంబాలను నేరుగా కలుస్తారని, అధికారంలో ఉన్న పార్టీగా, వైఎస్ఆర్‌సీపీ పదాతిదళం రాష్ట్రవ్యాప్తంగా ప్రజలతో మమేకమయ్యే భారీ సర్వే కార్యక్రమంగా దీన్ని చూడాలన్నారు. గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు నేరుగా ప్రజలను కలిసి..గతానికి ఇప్పటి ప్రభుత్వానికి తేడాను చెబుతూ వైఎస్ జగన్ మోహన్ రెడ్డి నాయకత్వాన్ని ఎందుకు కోరుకోవాలో? వారి భావితరాల భవిష్యత్తుకు వైఎస్ఆర్‌సీపీకి అధికారం ఆవశ్యకతను వివరిస్తున్నారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కొండపల్లి రుక్మిణి వైస్‌చైర్మన్ యిండుపూరు గున్నేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు కొండపల్లి బాలకృష్ణ, మున్సిపల్ ఫ్లోర్‌లీడర్ మంత్రి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ గొర్లి మాధవరావు, వార్డు కౌన్సిలర్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, సీనియర్ నాయకులు, సచివాలయాల కన్వీనర్లు, గృహ సారథులు, కార్యకర్తలు వలంటీర్లు తదితరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

సీతానగరంలో..

సీతానగరం: రాష్ట్రప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో లబ్ధిపొందుతున్న ప్రజలంతా జగనన్నకు నిండు మనస్సుతో మద్దతు ఇవ్వాలని ఎమ్మెల్యే అలజంగి జోగారావు కోరారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని గాదెలవలసలో సర్పంచ్ బి.అన్నపూర్ణమ్మ ఆధ్వర్యంలో సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, గ్రామ వలంటీర్లతో నిర్వహించిన జగనన్నే మా భవిష్యత్తు' కార్యక్రమంలోఎమ్మెల్యే అలజంగిజోగారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గ్రామాల్లో ప్రజల ఇళ్లకు వెళ్లి వారిని నేరుగా కలుసుకుని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పొందిన లబ్ధి, ఆర్థికపరమైన ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఎం.బాబ్జీ, ఎంపీపీ ప్రతినిధి బి.శ్రీరాములు, టీసీ కార్పొరేషన్ డైరెక్టర్ ఎస్ తిరుపతి, ఆయా గ్రామాల సర్పంచ్‌లు బి.అన్నపూర్ణమ్మ, ఎస్. మహేశ్వరరావు,పాల్గొన్నారు. అలాగే మండలంలోని నిడగల్లు గ్రామంలో ఎంపీపీ బి. రమణమ్మ, వైస్ ఎంపీపీ టి.సూర్యనారాయణ, చినభోగిలిలో సర్పంచ్ కురమానరాధ, కేఎస్ పురంలో సర్పంచ్ యు.విజయలక్ష్మి, వివిధ సెగ్మెంట్‌ల ఎంపీటీసీలు, వైఎస్సార్‌సీపీ నాయకులు కార్యక్రమం నిర్వహించారు.

బలిజిపేటలో..

బలిజిపేట: మండలంలోని వివిధ గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందులో భాగంగా నూకలవాడలో కన్వీనర్లు, గృహసారథుల ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కన్వీనర్ వెంకటరమణ మాట్లాడుతూ ఎన్నో సంక్షేమ పథకాలను అందిస్తున్న సీఎం జగన్మోహన్ రెడ్డిని మళ్లీ రెండవసారి సీఎంగా గెలిపించుకోవాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, గృహసారథులు, కన్వీనర్లు, వలంటీర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బలిజిపేట: నూకలవాడలో ఇంటింటికీ తిరుగుతున్న కన్వీనర్లు, గృహసారథులు



సీతానగరం: పెదంకలాంలో ప్రజలమద్దతు కోరుతున్న ఎంపీపీ బి.రమణమ్మ



పార్వతీపురం టౌన్: గోడకు స్టిక్కర్‌ను అంటిస్తున్న వృద్ధురాలు



సాలూరు: బాగువలసలో జగనన్నే మా భవిష్యత్ కార్యక్రమం నిర్వహిస్తున్న జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, తదితరులు

మద్దతుగా నిలవండి ..

సాలూరు: రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి పాలన అందిస్తున్న సంక్షేమ ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి ప్రజలందరూ మద్దతివ్వాలని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. పట్టణం, మండలంలోని పలు గ్రామాల్లో జగనన్నే మా భవిష్యత్.. కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని బాగువలసలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి.. నక్కడవలసలో వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్.. మెట్టవలసలో సర్పంచ్ మువ్వల ఆదయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు దండి శ్రీనివాసరావు.. పట్టణంలోని 8వ వార్డులో పట్టణ కన్వీనర్ గిరి రఘు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ జర్జాపు దీప్తి, తదితరులు ప్రజలతో మాట్లాడి చంద్రబాబు, జగన్‌మోహన్‌రెడ్డి పాలనల మధ్య వ్యత్యాసాన్ని వివరించారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న జగన్ మోహన్‌రెడ్డి పాలనపై ప్రజాభిప్రాయం తెలుసుకున్నారు. రానున్న ఎన్నికల్లో జగనన్నకు మరో అవకాశం ఇవ్వాలని కోరారు.

అన్నివర్గాల సంక్షేమమే సీఎం లక్ష్యం..



సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరిస్తూ, కరపత్రం అందిస్తున్న డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

పాచిపెంట: సీఎం జగన్ మోహన్‌రెడ్డితోనే అన్ని వర్గాల సంక్షేమం సాధ్యమని డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖా మంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. జగనన్నే మా భవిష్యత్ – మా నమ్మకం నువ్వేజగన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని పణుకువలస, పి.కొనవలస, గైరమ్మపేట గ్రామాల్లో పర్యటించారు. తమ గ్రామాలకు వచ్చిన మంత్రి రాజన్నదొరకు స్థానిక ప్రజలు దింశా నృత్యాలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి నాలుగేళ్లగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి పనులు, అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను మంత్రి ప్రజలకు వివరించారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజాసంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. సచివాలయ వ్యవస్థతో అనేక ప్రజాసమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మరో అవకాశం ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కొరజన్ని సింహాచలం, పార్టీ మండల అధ్యక్షుడు గొట్టాపు ముత్యాలనాయుడు, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పాచిపెంట వీరంనాయుడు, వైస్ ఎంపీపీ కొరిసల్లి రవీంద్రనాథ్, మాజీ వైస్ ఎంపీపీ తట్టికాయల గౌరీశ్వరరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరి



వేసవిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్న డీఐఓ డాక్టర్ టి.జగన్‌మోహన్‌రావు

- డీఐఓ డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు

పార్వతీపురంటౌన్: ప్రజలంతా వేసవిలో జాగ్రత్తలు తప్పనిసరిగా తీసుకోవాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి(డీఐఓ)డాక్టర్ టి. జగన్‌మోహన్‌రావు అన్నారు. ఈ మేరకు ఆయన ఆదివారం మండలంలోని వెంకంపేట, పెదబొండపల్లి గ్రామాలను సందర్శించి వేసవికాలంలో ప్రబలే అనారోగ్య లక్షణాలు, ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వేసవి కాలంలో ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉండడం వల్ల శరీరంలో నీటి శాతం తగ్గిపోతుందని ముఖ్యంగా వృత్తి రీత్యా బయట ప్రాంతాల్లో, ఎండలో పనిచేసే వారిపై మరింత ప్రభావం చూపుతుందని సరైన ముందస్తు జాగ్రతలు తీసుకోకుంటే వడదెబ్బకు గురయ్యే ఆస్కారం ఉంటుందన్నారు. వడదెబ్బకు గురైనప్పుడు చర్మం పొడి బారడం, తలనొప్పి, వికారం, స్పృహ కోల్పోవడం సంభవిస్తాయని, అలాంటప్పుడు బాధిత వ్యక్తిని వెంటనే దగ్గర ఉన్న నీడ ప్రాంతంలో ఉంచి, తడి గుడ్డతో శరీరం తుడవాలని, గాలి తగిలేలా చూడాలని, స్పృహలో ఉన్నప్పుడు మాత్రమే నీరు ఇవ్వాలని సూచించారు. తదుపరి ఓఆర్ఎస్ ద్రావణం ఇచ్చి తీవ్రతను బట్టి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో చేర్చాలని పేర్కొన్నారు.

వైద్య సిబ్బంది దగ్గర ఓఆర్ఎస్

వృత్తి రీత్యా గానీ, ఏదైనా పనిమీద బయటకు వెళ్ళే ముందు నీరు, మజ్జిగ, నిమ్మరసం మొదలగు ద్రావణాలను తాగాలని, అలాగే నీరు వెంట తీసుకువెళ్లాలని, అత్యవసరమైతే తప్ప ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 3 గంటల మధ్య బయట తిరగరాదని సూచించారు. లేత రంగు దుస్తులు ధరించాలని అవి ఉష్ణోగ్రతలను తక్కువగా గ్రహిస్తాయని, టోపీ లేదా గొడుగు ఉంచుకోవాలని, దాహం వేసే వరకు వేచి ఉండకూడదని ఎప్పటికప్పుడు నీరు, మజ్జిగ, నిమ్మరసం,బార్లీ మొదలగు ద్రావణాలను ఇంటిలో అందుబాటులో ఉంచుకుని తాగడం వల్ల డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉంటామని, మూత్రం పసుపు రంగులో ఉంటే డీ హైడ్రేషన్‌కు సూచన కావచ్చని స్పష్టం చేశారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది వద్ద ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉన్నాయని తెలియజేస్తూ అక్కడ కొంత మందికి ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందజేశారు. ఎప్పటికప్పుడు అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని, ఓఆర్ఎస్ + జింక్ కార్నర్‌లను ఏర్పాటు చేయాలని వైద్య సిబ్బందికి డీఐఓ జగన్‌మోహన్‌రావు సూచనలు చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది జయగౌడ్, దుర్గాప్రసాద్, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మందుల ధరలు తగ్గించాలి



సమావేశంలో మాట్లాడుతున్న పెంటపాటి సూర్యారావు

పార్వతీపురంటౌన్:

ఔషధ నియంత్రణ సంస్థ మందుల ధరలు తగ్గించాలని వినియోగదారుల సంఘం పార్వతీపురం అధ్యక్షుడు పెంటపాటి సూర్యారావు కోరారు. ఈ మేరకు ఆదివారం స్థానిక వినియోగదారుల సంఘం కార్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అత్యవసర మందుల జాబితాలో సుమారు 650 రకాల ధరలను తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయించినప్పటికీ, ఏప్రిల్ 1 నుంచి తగ్గిన మందుల ధరలు అమలు చేయనందున వాటిని తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రిటైల్ దుకాణ దారులు పాత ధరలకే అమ్ముతున్నారని, వాటిపై ఔషధ నియంత్రణ పరిపాలన విభాగం నిఘా పెట్టాలని అభిప్రాయ పడ్డారు. మందుల ధరలపై ప్రత్యేక నిఘా ఉంచాలని, వినియోగదారులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ రామకృష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

24 మందికి ఉచిత నేత్ర వైద్యపరీక్షలు



పెదపెంకిలో వైద్య పరీక్షలు చేస్తున్న ఆప్తాలమిస్ట్ కిరణ్

బలిజిపేట: మండలంలోని పెదపెంకిలో ఆదివారం నిర్వహించిన ఉచిత నేత్ర వైద్యశిబిరంలో 24మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ మేరకు పెదపెంకి నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్లసంజీవనాయుడు ఆధ్వర్యంలో తాటిబంద ప్రాథమిక పాఠశాల వద్ద వైద్యశిబిరం నిర్వహించారు. ఈ ఉచిత నేత్ర వైద్య శిబిరంలో 24మందికి పరీక్షలు నిర్వహించగా 15మంది శస్త్ర చికిత్సకు ఎంపికైనట్లు ఆప్తాలమిక్ కిరణ్ తెలిపారు. వారిని విజయనగరంలోని వెంకట పుష్పగిరి హాస్పిటల్‌కు తీసుకువెళ్లి శస్త్ర చికిత్సలు పూర్తిచేసిన తరువాత తిరిగి పెదపెంకి గ్రామానికి చేరుస్తామని తెలిపారు. కార్యక్రమంలో పి.శంకర్, ఈ.మధు, డి.జశ్వంత్, కె.సతీష్, ఎస్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌సీ దాతృత్వం

కొమరాడ: పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కె.కృష్ణమూర్తి తన సేవాభావాన్ని చాటుకున్నారు. మండలంలోని సర్వపాడు గ్రామంలో ఇంటిగోడ కూలిపోయి ప్రాణాలు కోల్పోయిన కేంద్రీక శంకరరావు, జీలకర్ర మాణిక్యమ్మ కుటుంబ సభ్యులకు, ఇదే ప్రమాదంలో గాయపడిన మెల్లక రాజు, జీలకర్ర హరికృష్ణ, మండంగి రవిలకు రూ.5వేలు చొప్పున నగదుతో పాటు 78 కిలోల బియ్యం అందజేశారు. సర్పంచ్ హిమరిక గంగాధర్ చేతులమీదుగా ఆదివారం బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.



బాధితులకు ఆర్థిక సాయాన్ని అందిస్తున్న హెచ్‌సీ కృష్ణమూర్తి

ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలి..



అన్నసమారాధనలో పాల్గొన్న జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, దంపతులు



అన్నసమారాధనలో పాల్గొన్న ఉపముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర

సాలూరు: ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఉప ముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖా మంత్రి పీడిక రాజన్నదొర ఆకాంక్షించారు. పట్టణంలో వెలమపేట రామమందిరం వద్ద ఆదివారం జరిగిన అన్నసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అలాగే జీసీసీ చైర్‌పర్సన్ శోభా స్వాతిరాణి, గులిపల్లి గణేష్ దంపతులు కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.

పార్కులో పర్యాటకుల సందడి

సీతంపేట: స్థానిక అడ్వంచర్ పార్కులో ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవురోజు కావడంతో చిన్నారులు, పెద్దలు పార్కుకు వచ్చి కాసేపు సేదతీరారు. జలవిహార్‌లో బోటుషికారు, హ్యాంగింగ్ బ్రిడ్జిపై వాకింగ్, స్కై సైక్లింగ్ చేస్తూ ఉత్సాహంగా గడిపారు. అలాగే సమీపంలోని మెట్టుగూడ జలపాతాన్ని సందర్శించి ప్రకృతి అందాలను ఆస్వాదించారు.



హ్యాంగింగ్ బ్రిడ్జిపై నడుస్తున్న సందర్శకులు



బోటుషికారు చేస్తున్న పర్యాటకులు